క్లుప్తంగా

గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ దాడులు



చిన్నంబావి: మండలంలోని బీమ్లానాయక్‌తండాలో ఎక్సైజ్ శాఖ సీఐ రఘునాథ్‌రెడ్డి, ఎస్ఐ కిరణ్‌గౌడ్, వెంకట్రాములు ఆధ్వర్యంలో శుక్రవారం గుడుంబా స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 5 లీటర్ల సారా, 450 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు దాడులు నిర్వహించినట్లు తెలిపారు. అక్రమంగా గుడుంబా తయారు చేసినా, అమ్మినా చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో పోలీస్, ఎక్సైజ్ శాఖ సిబ్బంది శేఖర్, కురుమూర్తి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

విశ్వనాథ తపోవనంలో ప్రత్యేక పూజలు



పాన్‌గల్: మండలంలోని తెల్లరాళ్లపల్లిలో కాశీ విశ్వనాథ తపోవన ఆశ్రమంలో మహా శివ రాత్రి సందర్భంగా ఆశ్రమ బ్రహ్మచారి శ్రీ వెంకట్‌చరణ్, శివ తపోవన ఆశ్రమ పీఠాధిపతుల ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రత్యేక పూజలో సుప్రభాత సేవ, పుణ్యాహావచనం ప్రణవ పతాక ఆవిష్కరణ, అఖండ జ్యోతి ప్రజ్వలన, గణపతిపూజ, హోమం, అన్నదానం వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

మానవత్వం చాటుకున్న కండక్టర్



వీపనగండ్ల: కొల్లాపూర్ డిపో బస్సు బొల్లారం, కల్వరాల మీదుగా కర్నూల్ వెళ్తుండగా కల్వరాలకు చెందిన ప్రయాణికుడు బాలకృష్ణారెడ్డి తన బ్యాగును బస్సులోనే ఉంచి పెబ్బేరులో బస్సు దిగి వెళ్లిపోయారు. బ్యాగులో ఉన్న రూ.25వేలు, సెల్‌ఫోన్‌ను కండక్టర్ సాయిశ్వర్ గుర్తించి సెల్‌ఫోన్‌లో ఉన్న అడ్రస్ ద్వారా ప్రయాణికుడు బాలకృష్ణారెడ్డికి సమాచారం చేరవేశారు. ప్రయాణికుడు పెబ్బేరుకు చేరుకోగా కంట్రోలర్‌తో కలిసి సాయిశ్వర్ బాధితుడికి బ్యాగుతో పాటు రూ.25వేల నగదును అందజేశారు. ఈ సందర్భంగా ప్రయాణికులు కండక్టర్‌తో పాటు డ్రైవర్‌ను అభినందించారు.

ఉచిత వైద్య శిబిరం



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని రేడియంట్ హైస్కూల్‌లో శుక్రవారం ఓ ప్రైవేట్ ఆస్పత్రి ఆధ్వర్యంలో డెంటల్ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు స్కూల్ డైరెక్టర్ రాములుయాదవ్ తెలిపారు. డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ శివకుమార్ బృందంతో 360మంది విద్యార్థులను పరిశీలించామన్నారు. ఈ మేరకు విద్యార్థులకు సూచనలు, సలహాలు ఇచ్చి తగు వైద్యాన్ని అందించారని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల బృందం ఎండీ షఫీ, చిత్ర, రాజేంద్రప్రసాద్ చారి, కృష్ణ కుమార్, సురేందర్, ఆజాం, మద్దిలేటి, శంకర్, వెంకటేష్, సుహాసిని, మాధవి, ఆశాజ్యోతి, రాణి, గాయత్రి, శోభ, కృష్ణవేణి, నాగరాణి తదితరులు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడిపితే చర్యలు

పెబ్బేరు: మైనర్లు బైక్ నడిపితే వారిపై చర్యలు తీసుకుంటామని శుక్రవారం ఎస్ఐ జగదీష్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పట్టణంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. బైక్ నడుపుతున్న మైనర్లు పట్టుకొని కేసు నమోదు చేయడంతో పాటు తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ ఇచ్చి, రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. అలాగే మండలంలోని రంగాపూర్ సమీపంలో 44వ జాతీయ రహదారిపై రాంగ్ రూట్‌లో బైకులు నడుపుతున్న వారికి జరిమానా వేశారు. అనంతరం పట్టణంలోని ప్రధాన చౌరస్తాలో పూలు, పండ్ల బండ్లు రోడ్డుపై పెట్టుకోవడంతో వచ్చిపోయే వాహనాలకు, ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయని సూచించారు. రోడ్డుకు దూరంగా బండ్లు ఉంచాలని వారికి అవగాహన కల్పించారు.



సమన్వయంతో పనిచేస్తేనే ఫలితం

- విధులను నిర్లక్ష్యం చేస్తే సహించం
- అధికారుల పనితీరుపై ఎంపీపీ ఆగ్రహం
- వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



నివేదిక చదివి వినిపిస్తున్న అధికారులు

ఆత్మకూర్: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో ముందుకు వెళ్లాలని, ప్రజలకు మేలు చేసేవిధంగా పనిచేయాలని ఎంపీపీ బంగారు శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు అధికారుల పనితీరుపై ధ్వజమెత్తారు. ఈ సందర్భంగా పలు సమస్యలను సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. పల్లెప్రగతిలో అవసరం ఉన్నచోట కొత్త స్తంభాలు పాతినా.. నేటి వరకు విద్యుత్ తీగలు ఏర్పాటు చేయలేదని అసహనం వ్యక్తం చేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని, వ్యవసాయానికి విద్యుత్ కోతలు నిర్వహిస్తున్నారని, ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్యులు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు ఆందోళన చేశారు.

ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పల్లెప్రగతి, పట్టణ ప్రగతి చేపట్టినా కొందరు ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యంలో ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. స్తంభాలు మార్చాలని, విద్యుత్ తీగలు సరి చేయాలని సర్పంచ్‌లు ఎన్ని సార్లు విన్నవించినా ట్రాన్స్‌కో అధికారులు స్పందించకపోవడం విచారకరమన్నారు. పనులు చేయడం చేతకాకపోతే ఉద్యోగానికి రాజీనామా చేసి వెళ్లిపోవాలని స్పష్టం చేశారు. త్వరలోనే సమస్యలన్నింటిని పరిష్కరిస్తామని ఆయాశాఖల అధికారులు హామీ ఇవ్వడంతో సభ్యులు శాంతించారు. అలాగే సాగునీరు, వైద్యం, విద్య, వ్యవసాయం, పౌర సరఫరాలు, ఆర్‌అండ్‌బీ, పంచాయతీరాజ్, ఉపాధి, తదితర శాఖల ప్రగతి నివేదికలను వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ శివరంజని, వైస్‌ఎంపీపీ కోటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు కృష్ణమూర్తి, లక్ష్మీకాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఎస్ఏ రాజు, తహసీల్దార్ సింధూజ, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, కోఆప్షన్ మహబూబ్‌పాష తదితరులుఉన్నారు.

మెడికల్ వ్యర్థాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

పాన్‌గల్: మండల కేంద్రంలోని పాల్కి చెరువు పరిసరాల్లో పడవేసిన మెడికల్ వ్యర్థాలను తొలగించాలని డీఎంహెచ్ఓ డా.రవిశంకర్ పారిశుద్ధ్య సిబ్బందిని ఆదేశించారు. 'చెరువు పరిసరాల్లో మెడికల్ వ్యర్థాలు' అనే శీర్షికతో సాక్షి దినపత్రికలో గురువారం వచ్చిన కథనానికి అధికారులు స్పందించి శుక్రవారం చెరువు పరిసరాలను పరిశీలించారు. చెరువు సమీపంలో మెడికల్ వ్యర్థాలను పారబోసిన వారిని గుర్తించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. చెరువు పరిసరాల్లో ఎలాంటి కలుషిత పదార్థాలు వేయరాదని, భవిష్యత్‌లో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా గట్టి చర్యలు తీసుకోవాలన్నారు.

పీహెచ్‌సీ సందర్శన

మండల కేంద్రంలోని పీహెచ్‌సీని డా.రవిశంకర్ సందర్శించి ఆస్పత్రిలోని సౌకర్యాలు, అందుతున్న సేవలు, రికార్డులు, ఆస్పత్రి పరిసరాలు, సమస్యలపై ఆరా తీశారు. దీంతో పాటు పీహెచ్‌సీలో చికిత్స పొందుతున్న రోగులను ఆయన పరిశీలించి వైద్య సేవలపై వివరాలు సేకరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఏసయ్య, ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, పీహెచ్‌సీ డాక్టర్ హరినాథ్‌రెడ్డి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.



పాల్కి చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ రవిశంకర్

'బీఆర్ఎస్ కుట్రలను భగ్నం చేద్దాం'



వీపనగండ్లలో మాట్లాడుతున్న శ్రీనివాసులు

వీపనగండ్ల: పేదలకు సంక్షేమ పథకాలను అమలు పరచడంలో పూర్తిగా విఫలమైన సీఎం కేసీఆర్ కుట్రలు, కుతంత్రాలతో తిరిగి అధికారంలోకి రావాలని చూస్తున్నారని, వారి కుట్రలను భగ్నం చేసేందుకు ప్రజలను సమాయత్తం చేస్తామని నియోజవర్గ బీజేపీ కన్వీనర్ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రజల ఘోష, బీజేపీ భరోసా కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. త్యాగాలతో ఏర్పడ్డ రాష్ట్రంలో అమరుల కుటుంబాలకు ఎలాంటి న్యాయం జరగక పోగా కేసీఆర్ కుటుంబ సభ్యులకు పదవులు కట్టబెడుతున్నారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ఈజీఎస్, రేషన్ బియ్యం, ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డులు తదితర సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా.. వాటిని తమ పథకాలుగా బీఆర్ఎస్ వారు ప్రచారం చేసుకుంటూ ప్రజలను తప్పుదోవ పట్టించాలని చూస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు వెంకటయ్య, మండల ప్రధాన కార్యదర్శి ఆవుల నారాయణ, నాయకులు ఉస్సేన్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని వనపర్తి నియోజకవర్గ కన్వీనర్ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని శేరుపల్లిలో బీజేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గ్రామ శక్తి కేంద్ర కార్నర్ బూత్‌స్థాయి సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్, కిసాన్ సన్మాన్‌యోజన, సుకన్యయోజన, జన్‌ధన్, అటల్ పింఛన్, ఉపాధి హామీ పథకాలతో పేదల సంక్షేమానికి బీజేపీ కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ ఓబీసీ మోర్చ అధ్యక్షుడు రాఘవేందర్‌గౌడ్, మండల అధ్యక్షులు వెంకటస్వామి, భగవంతుయాదవ్, నాయకులు ఆంజనేయులు, ఎల్లస్వామి, నరేష్, నాగరాజు పాల్గొన్నారు.

పుట్ట గొడుగుల పెంపకంపై శిక్షణ

మదనాపురం: మండల కేంద్రంలోని కేవీకే యూత్ ఫర్ యాక్షన్ ఆధ్వర్యంలో భారత వ్యవసాయ పరిశోధన మండలి వారి ఆర్థిక సహకారంతో పుట్ట గొడుగుల పెంపకంపై నిరుద్యోగ యువతకు 30 రోజుల ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కేవీకే శాస్త్రవేత్తలు రాజేందర్‌రెడ్డి, సురేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఒక్కో క్యాంపులో 25 మందికి శిక్షణ ఇస్తారని, శిక్షణ సమయంలో ఉచిత వసతి, భోజన సదుపాయం కల్పిస్తామన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువత కృషి విజ్ఞాన కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పాస్ ఫోటో, ఆధార్ కార్డ్ జిరాక్స్ సమర్పించి రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. వనపర్తి, నారాయణపేట, గద్వాల జిల్లాలకు చెందిన వారు అర్హులని పేర్కొన్నారు.

ప్రభుత్వ స్థలం కాపాడాలని కౌన్సిలర్ నిరసన



వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని 4వ వార్డు జమ్మి చెట్టు వద్ద ఉన్న గ్రామ కంఠం స్థలాన్ని ఓ వ్యక్తి అక్రమంగా కబ్జా చేయడంతో పాటు అనుమతి లేకుండా నిర్మాణం చేపడుతున్నారని కౌన్సిలర్ పద్మ మున్సిపల్ కమిషనర్ చాంబర్‌లో నేలపై కూర్చొని నిరసన వ్యక్తం చేశారు. దీంతో విధుల్లో భాగంగా ఫీల్డ్‌కు వెళ్లిన కమిషనర్ విక్రమసింహారెడ్డి వెంటనే అక్కడికి చేరుకున్నారు. కబ్జా చేసిన స్థలంలో అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కౌన్సిలర్ పద్మ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనుమతి లేని అక్రమ నిర్మాణాన్ని నిలివేస్తామని హామీ ఇవ్వడంతో కౌన్సిలర్ ధర్నాను విరమించారు.

తహసీల్దార్‌కు వినతి



అమరచింత: జామియా మస్జిద్‌కు సంబంధించిన సర్వే నంబర్ 6 లోని రెండు ఎకరాల 15గుంటల పట్టా భూమిని వక్ఫ్‌బోర్డులో కలపడాన్ని నిరసిస్తూ ముస్లింలు స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. మస్జిద్‌కు సంబంధించిన వ్యవసాయభూమి హనీఫ్‌ఖాన్ పేరిట రిజిస్టర్ అయ్యిందని, ఈ భూమిని వక్ఫ్ భూమి నుంచి తొలగించి న్యాయం చేయాలని కోరారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్ చాంద్‌పాషకు అందజేశారు. కార్యక్రమంలో మస్జిద్ కమిటీ సభ్యులు రఫీ, ఖాజ, తౌఫిక్, ఖాసీం, పాష, మన్నాన్, అల్తాఫ్, ఆబిద్, సద్దాం ఉన్నారు.

సీసీరోడ్డు నిర్మించాలని..

అమరచింత: స్థానిక భగత్‌సింగ్ విగ్రహం నుంచి మస్తీపురం క్రాస్ రోడ్డు వరకు సీసీరోడ్డు నిర్మించాలని అమరచింత ఎత్తిపోతల లబ్ధిదారుల సంఘం నిర్వాహకులు శుక్రవారం పెబ్బేరు ఇరిగేషన్ సూపరిటెండెంట్ ఇంజినీర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుంతలమయంగా మారిన మట్టి రోడ్డుపై సీసీ రోడ్డును నిర్మించి రైతులకు, ప్రయాణికులకు మేలు చేకూర్చాలని కోరారు. కార్యక్రమంలోజయసింహారెడ్డి, రాంరెడ్డి, లింగారెడ్డి, ప్రతాప్‌రెడ్డి ఉన్నారు.

ఇరుముడులతో మల్లన్న దర్శనానికి..

వనపర్తి క్రైం: మహాశివరాత్రిని పురస్కరించుకొని శ్రీశైలం మల్లన్న దర్శనానికి ఇరుముడులతో శివ మాలధారులు బయలుదేరారు. శుక్రవారం ఉదయం జిల్లా కేంద్రంలోని శ్రీ చింతల హనుమాన్ ఆలయంలో మాలధారులు ఇరుముడి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు, మాలధారులకు అన్నదానం నిర్వహించారు.

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని అంబ భవానీ ఆలయంలో శివ మాలధారులు ఇరుముడి కార్యక్రమాన్ని అంగరంగా వైభవంగా నిర్వహించారు. ఆలయం శివనామస్మరణంతో మారుమోగింది. దీక్ష పూర్తి చేసుకున్న స్వాములు ఆలయంలో పూజలు నిర్వహించి ఇరుముడి కట్టుకొని శ్రీశైలం బయలు దేరి వెళ్లారు.



టీబీ రోగులకు పౌష్టికాహారం పంపిణీ



టీబీ రోగులకు పౌష్టికాహారం అందిస్తున్న వర్కటం జగన్నాథ్‌రెడ్డి

ఆత్మకూర్: పౌష్టికాహారం లోపంతో ఇబ్బందులు పడుతున్న 22 మంది టీబీ రోగులకు వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి రూ. 1.50లక్షలతో పౌష్టికాహారం అందించి అండగా నిలిచారు. శుక్రవారం స్థానిక క్లస్టర్ ప్రభుత్వాస్పత్రిలో వైద్యాధికారి రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ టీబీ వ్యాధి పౌష్టికాహారం లోపంతో, ఇతర వ్యసనాల కారణంగా వ్యాపిస్తుందన్నారు. వీజేఆర్ ఫౌండేషన్ అధినేత వర్కటం జగన్నాథ్‌రెడ్డి 22 మంది టీబీ రోగులకు రూ.1.50లక్షలతో ఆరు నెలలకు సరిపడా పౌష్టికాహారం అందించడం అభినందనీయమని కొనియాడారు. ప్రభుత్వాస్పత్రిలో ఇచ్చే మందులతో పాటు పౌష్టికాహారం అందిస్తే రోగులు త్వరగా కోలుకుంటారన్నారు. అనంతరం టీబీ రోగులతో కలసి కేసీఆర్ జన్మదినం సందర్భంగా కేక్ కట్‌చేసి పంచిపెట్టారు. అలాగే ఆరేపల్లి గ్రామంలో గ్రామస్తుల మధ్య కేసీఆర్ జన్మదిన వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో వైద్యులు నిస్సార్ అహ్మద్, హెల్త్‌సూపర్‌వైజర్లు సురేందర్‌గౌడ్, సామ్రాజ్యలక్ష్మి, సావిత్రి, జహంగీర్, ఏఎన్ఎంలు రాజమణి, వరలక్ష్మి, నాగలక్ష్మి, అనిత, నిర్మల, శోభ తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలు పెంచాలి



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్

పాన్‌గల్: తొలిమెట్టు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేస్తూ విద్యార్థుల సామర్థ్యాలను పెంచాలని ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ ఉపాధ్యాయులకు సూచించారు. శుక్రవారం మండలంలోని వెంగళాయిపల్లి ప్రాథమిక, జమ్మాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన సందర్శించి తొలిమెట్టు కార్యక్రమంలో భాగంగా 4, 5 తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. తెలుగు, గణితం సబ్జెక్టుల్లో విద్యార్థులను ప్రశ్నలు అడిగి జవాబులను రాబట్టారు. విద్యార్థులు చక్కగా సమాధానాలు చెప్పడంతో ఎంఈఓ సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ ప్రకారం భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు వెంకటేష్‌యాదవ్, వీరాశేఖరాచారి, సీఆర్పీ గోవింద్‌నాయక్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

సాగునీటి సరఫరాలో అడ్డంకులు ఉండవు



కేఎల్ఐ కాల్వలో నీటిని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పాన్‌గల్: మండలంలోని బండపల్లి స్టేజీ సమీపంలోని కేఎల్ఐ కాల్వలో నీటి సామర్థ్యాన్ని శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామాల మీదుగా ప్రవహిస్తున్న కేఎల్ఐ కాల్వకు కొన్ని రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందని, ఈ విషయాన్ని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకవెళ్లి కాల్వ ద్వారా సాగునీరు సక్రమంగా సరఫరా అయ్యేలా తగు చర్యలు తీసుకోవాలని కోరామన్నారుర. నీటి సరఫరా జరిగేలా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించడంతో కాల్వల ద్వారా సాగునీరు సరఫరా అవుతున్నట్లు వారు పేర్కొన్నారు. చివరి గ్రామాల రైతులకు నీరు సక్రమంగా చేరేలా ముందు గ్రామాల రైతులు సహకరించాలని కోరారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కాల్వల ద్వారా సాగునీరు సరఫరా చేయించిన ఎమ్మెల్యేకు రైతుల తరపున వారు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రైతుబంధు సమితి మండల కోఆర్డినేటర్ వెంకటయ్యనాయుడు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ దామోదర్‌రెడ్డి, సర్పంచ్ వెంకటయ్యయాదవ్, ఎంపీటీసీ సుబ్బయ్యయాదవ్, బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్‌నాయక్, యాదగిరిచారి, డా.తిరుపతయ్యయాదవ్, బక్కారెడ్డి, తిరుపతియాదవ్, నవీన్ రెడ్డి పాల్గొన్నారు.

రైతు పక్షపాతి సీఎం కేసీఆర్



వనపర్తిలో కేక్‌కట్ చేస్తున్న గట్టుయాదవ్ తదితరులు

సాక్షి, నెట్‌వర్క్: సీఎం కేసీఆర్ రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేసి రైతు పక్షపాతి మారారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రం సమీపంలోని మార్కెట్ యార్డ్‌లో పల్లీలు, ఉప్పు, ఉలువలతో కేసీఆర్ చిత్రపటాన్ని ఆకర్షణీయంగా ఏర్పాటు చేసి నాయకులు, రైతులు తమ అభిమానాన్ని చాటుకున్నారు. కేసీఆర్ ఆయురారోగ్యాలతో ఉండాలని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాలు, పట్టణాల్లో బీఆర్ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబురాలు చేసుకున్నారు. అనంతరం ఆస్పత్రులు, అనాథ శరణాలయాల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ పలుస రమేష్‌గౌడ్, జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్ రెడ్డి, జెడ్పీవైస్ చైర్మన్ వామన్‌గౌడ్, మున్సిపల్ చెర్‌పర్సన్లు కరుణశ్రీ, గాయత్రి, సుభేశిని, మున్సిపల్ వైస్ చైర్మన్లు విజయభాస్కర్‌రెడ్డి, వాకిటి శ్రీధర్, కర్రెస్వామి, ఎంపీపీలు బంగారు శ్రీను, గుంత మౌనిక, జెడ్పీటీసీలు రఘుపతిరెడ్డి, శివరంజని, సీడీసీ చైర్మెన్ చెన్నకేశవరెడ్డి, వైస్‌ఎంపీపీ కోటేష్, దిలీప్‌కుమార్‌రెడ్డి, వెంకటయ్యనాయుడు, చంద్రశేఖర్‌నాయక్, దామోదర్‌రెడ్డి, సర్పంచ్‌లు గోపాల్ రెడ్డి, వెంకటయ్యయాదవ్, నాగేష్‌నాయుడు, నవీన్ రెడ్డి, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, వైద్యాధికారి వంశీ కృష్ణ, మండల అధ్యక్షులు సత్యనారాయణగౌడ్, రవియాదవ్, పీఏసీఎస్ అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల రైతుబంధు అధ్యక్షుడు రాజాప్రకాష్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో..

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



వనపర్తిలోని తెలుగువాడ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

వనపర్తి టౌన్: జిల్లా కేంద్రంలోని తెలుగువాడ జెడ్పీహెచ్ఎస్‌లో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ మేరకు విద్యార్థులు డీఈఓ, ఎంఈఓ, హెచ్‌ఎం, ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు తరగతులు బోధించారు. ఈ సందర్భంగా ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను ప్రదానం చేశారు.

పాన్‌గల్: మండలంలోని చింతకుంట ప్రాథమిక, ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎంగా ఫౌజియాబేగం, ఎంఈఓగా కరుణశ్రీ వీరితో పాటు 15 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం నారాయణ, ఉప సర్పంచ్ శాంతమ్మ, ఎస్ఎంసీ చైర్మన్ హకీంపాష, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

ఉన్నత పాఠశాలలో..

చింతకుంట ఉన్నత పాఠశాలలో నిర్వహించిన స్వయం పాలన దినోత్సవంలో కలెక్టర్‌గా అమీనాబేగం, డీఈఓగా బ్రాహ్మణి, హెచ్‌ఎంగా తిరుపతితో పాటు 20 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

పెబ్బేరు: మండలంలోని బునాదిపురం ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం విద్యార్థులు స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉపాధ్యాయులుగా మారి తమ తరగతి గదిలో తోటి విద్యార్థులకు పాఠాలు చెప్పి అందరిని ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వనం గోవిందమ్మ, పాఠశాల చైర్మన్ రాఘవేందర్, ప్రధానోపాధ్యాయుడు ఎండీ మైనోద్దీన్, నాగేషు, దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలకు డిమాండ్

వనపర్తి టౌన్: ప్రభుత్వ ఒకేషనల్ కళాశాలలో కరెంట్ అవసరం లేదని ప్రిన్సిపాల్ మద్దిలేటి ట్రాన్స్‌కో అధికారులకు దరఖాస్తు చేయగా వారు గురువారం కరెంట్ కట్ చేశారు. ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతున్న సమయంలో కరెంట్ అవసరం లేదని కనెక్షన్ తొలగించడం ఏంటని శుక్రవారం ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ఎదుట ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ మద్దిలేటిని వెంటనే సస్పెండ్ చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆది డిమాండ్ చేశారు. ప్రాక్టికల్ జరుగుతుంటే కరెంట్ కట్ చేయడం ఏంటని విద్యార్థులు అడగగా.. ప్రిన్సిపాల్ దరఖాస్తు మేరకే తొలగించామని ట్రాన్స్‌కో అధికారులు తెలపడంతో ప్రిన్సిపాల్ వైఖరిపై విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ధర్నా అనంతరం కళాశాలలో విద్యుత్ సౌకర్యాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అశోక్, మల్లేష్, కృష్ణ, అజయ్, రఘు పాల్గొన్నారు.

'కంటివెలుగు'ను సద్వినియోగం చేసుకోవాలి

కొత్తకోట రూరల్: కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెద్దమందడి జెడ్పీటీసీ సభ్యుడు రఘుపతిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని దొడగుంటపల్లిలో కంటివెలుగు శిబిరాన్ని ఆయన జిల్లా రైతుబంధు అధ్యక్షుడు జగదీశ్వర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ వరలక్ష్మి, ఉప సర్పంచ్ కిష్టమ్మ, ఎంపీటీసీ భార్గవి, రాజప్రకాష్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, నాగేంద్రంయాదవ్ ఉన్నారు.

పాన్‌గల్: కంటి శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా అప్తమాలజి స్పెషల్ ఆఫీసర్ డా.పుష్పలత అన్నారు. శుక్రవారం మండలంలోని చిక్కేపల్లి, కొత్తపేట గ్రామాల్లో నిర్వహిస్తున్న కంటి వెలుగు కేంద్రాలను ఆమె సందర్శించారు. కార్యక్రమంలో అడిషనల్ డీఆర్‌డీఓ రేణుకా దేవి, డాక్టర్ హరినాథ్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి కృషి

పెబ్బేరు రూరల్ (శ్రీరంగాపురం): క్రీడల బలోపేతానికి ఎల్లప్పుడు తనవంతు సహకారం అందిస్తానని మండల కేంద్రానికి చెందిన సీనియర్ బ్యాడ్మింటన్ క్రీడాకారుడు శ్రీహరి నాగరాజు అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర పాఠశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సూగూరులో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో గెలుపొందిన బాలుర పాఠశాల కబడ్డీ క్రీడాకారులను అభినందించి, వారికి జ్ఞాపిక అందజేశారు.